క్లుప్తంగా

ఈవీఎం ఆధారంగా ఓటు వేయడంపై అవగాహన



సంతకవిటి మండలంలోని మల్లయ్యపేటలో ఫ్యాన్ గుర్తుకు ఓటువేయడాన్ని నేర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల ఆధారంగా ఓటువేసే విధానంపై ప్రజలకు వైఎస్సార్ సీపీ నాయకులు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో మూడు బృందాలుగా ఏర్పడి పర్యటిస్తున్న పార్టీ నేతలు డమ్మీ ఈవీఎం ద్వారా సీరియల్ నంబర్-3లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడాన్ని నేర్పిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని 32 పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రాల్లోని సౌకర్యాలపై ఆరాతీశారు. ఆర్‌సీఎం పాఠశాల మినహా అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు బాగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ కూడా త్వరితగతిన ఏర్పాట్లు చేయించాలని బీఎల్‌వోలకు సూచించారు.

పింఛన్ల పంపిణీ

రాజాం/రేగిడి/సంతకవిటి: మండలాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం చేపట్టారు. లబ్ధిదారుల్లో నడవలేని స్థితిలోని దివ్యాంగులు, వృద్ధులు, మంచానపడిన రోగుల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి, పింఛన్ నగదు అందజేశారు. మిగతా వారికి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాజాం మండలంలో 80 శాతం, రేగిడి మండలంలో 72 శాతం, సంతకవిటి మండలంలో 68 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవోలు పేర్కొన్నారు.

సోపేరులో అగ్నిప్రమాదం

రాజాం సిటీ: మండలంలోని సోపేరు గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన కోటగిరి మురళీకృష్ణ, అశోక్‌కుమార్‌లకు చెందిన అరటి తోటలు, వ్యవసాయానికి సంబంధించి, సాగునీటి పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల ద్వారా ప్రమాదం విషయం తెలుసుకున్న రాజాం ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు.

నేటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

రాజాం సిటీ: మండల కేంద్రంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణా తరగతులు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు టి.టి.వి.రమణమూర్తి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు శ్లోకాలు, యోగాసనాలు, నీతికథలు, పద్యాలు, ఋషుల జీవితచరిత్ర, మన పండగలు వంటి వాటిని తెలిపి, వాటిపై అవగాహన కల్పించనున్నామన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. తరగతుల ప్రారంభ, ముగింపు రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తలగాం, రుషింగి, కొప్పరవలస, కె.కొత్తవలస, బంగారువలస, కొండచాకరాపల్లి, ఐటీడీఏ కాలనీ, చినరాజులగుమ్మడ, పెదరాజులగుమ్మడ, వి.వి.ఆర్.పేటలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కోనూరు వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన కోరుకొండ రాము(49) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు. గత నెల 28న రేగిడి మండలం పోరాం గ్రామానికి చెందిన రాము స్వగ్రామం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అతని కంటే ముందు వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా ఆగడంతో వెనుక ట్రక్కును ఢీకొని గాయాల పాలయ్యాడు. బాధితుడిని కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని భార్య మగతమ్మ ఫిర్యాదు చేసిందని ఏఎస్‌ఐ తెలిపారు.

అభిమాన నేతకు.. జన నీరాజనం



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పరిచయం అనంతరం ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

వేలాదిమందిగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో జనసంద్రమైన వీధులు.. మండుటెండను సైతం లెక్క చేయకుండా తమ అభిమాన నాయకుడిని చూసి, తరించేందుకు పెద్దసంఖ్యలో బారులుతీరిన ప్రజలు.. దారిపొడవునా మద్దతు పలుకుతూ దశదిశలా మార్మోగిన జై జగన్.. జై వైఎస్సార్ సీపీ.. నినాదాలు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బొబ్బిలి విచ్చేసిన జననేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణుల నుంచి లభించిన ఘనస్వాగతమిది. అదే ఉత్సాహంతో జగనన్న సైతం తన ప్రసంగం కొనసాగిస్తూ సభను హోరెత్తించారు. సభకు వచ్చిన పార్టీ శ్రేణులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తారు. ఓ వైపు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూనే మరోవైపు చంద్రబాబు ప్రజలను నమ్మించి, మోసం చేస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ మరోసారి మోసపూరిత హామీలతో వస్తున్న టీడీపీ కూటమికి బుద్ధి చెప్పాలని, అధికారంలో ఉన్న ఐదేళ్లు మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బెల్లాన చంద్రశేఖర్, శంబంగి వెంకట చినఅప్పలనాయుడులను పరిచయం చేసి, వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. – సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలిలో సీఎం జగన్ భారీ బహిరంగ సభకు హాజరైన జనసందోహం

- బొబ్బిలిలో సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు పోటెత్తిన జనం
- జనసంద్రాన్ని తలపించిన సభాప్రాంగణం
- నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు
- దారిపొడవునా అభిమాన నేతకు జననీరాజనం
- హోరెత్తిన జై జగన్, జై వైఎస్సార్ సీపీ, జై శంబంగి నినాదాలు



జగన్ మామయ్యను చూసేందుకు ఎంతో ఉత్సాహంగా వెళ్తున్న చిన్నారి



బస్సులో వస్తున్న సీఎం జగన్‌ను చూసేందుకు పోటీపడుతున్న జనం



పార్టీ నాయకుడికి సీఎం జగన్ ఆప్యాయ పలకరింపు



అదిగో జగన్ మామయ్యా...

తరలిన అభిమాన గణం..

బొబ్బిలి/తెర్లాం/రామభద్రపురం: బొబ్బిలిలో బుధవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభకు రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. రామభద్రపురం నుంచి ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి ఆధ్వర్యంలో 22 గ్రామ పంచాయతీల నుంచి 300 వాహనాల్లో పార్టీ శ్రేణులు చేరుకుని, తమ అభిమానం చాటుకున్నారు. బొబ్బిలి పట్టణంలోని 31 వార్డుల నుంచి భారీగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు సీఎం సభకు హాజరై, జై జగన్ నినాదాలతో సభాప్రాంగణాన్ని హోరెత్తించారు. 29వ వార్డు నుంచి జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, 16వ వార్డు నుంచి ఎస్.రామకృష్ణ, గొల్లపల్లి నుంచి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మండల జనార్ధనరావు, తుట్ట తిరుపతి, మల్లంపేట నుంచి తెంటు పార్వతి, పాతబొబ్బిలి నుంచి పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు తమ అనుచరులతో ర్యాలీగా వెళ్లి, జగనన్నపై తమకున్న అభిమానం చాటుకున్నారు. తెర్లాం మండలంలోని 33 గ్రామ పంచాయతీల నుంచి పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడుల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి బొబ్బిలిలో జరిగిన సీఎం జగన్ సభకు మండుటెండను సైతం లెక్క చేయకుండా వేలాదిమందిగా తరలివెళ్లి, తమ అభిమాన నేతను చూసి, మురిసిపోయారు. ఆనందోత్సాహాలతో గంతులేశారు. జగనన్న.. మళ్లీ నువ్వే సీఎం కావాలని నినదించారు.



రామభద్రపురం: సీఎం జగన్ సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తెర్లాం: బొబ్బిలిలో జరిగిన సీఎం జగన్ సభకు కాలినడకన బయలుదేరి వెళ్తున్న తెర్లాం మండలంలోని మాదంబట్లవలస గ్రామస్తులు, నాయకులు



సీఎం జగన్ రాక కోసం ఎదురుచూస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు



తమ అభిమాన నాయకుడికి అభివాదం చేస్తున్న బొబ్బిలి ప్రజలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బొబ్బిలి/రామభద్రపురం/తెర్లాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా బొబ్బిలికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విచ్చేసిన నేపథ్యంలో చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బొబ్బిలి మున్సిపాలిటీలోని 16వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఈ ప్రదర్శన ఏర్పాటు చేయగా, పార్టీ జెండా రంగుల దుస్తులతో కనిపించిన కళాకారులు అందరి దృష్టినీ ఆకర్షించారు.



తెర్లాం: సీఎం జగన్ బహిరంగ సభ వద్ద బిందెల డ్యాన్స్ కళాకారులు

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. బుధవారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్.



రామభద్రపురం: పాడివానివలసలో వైఎస్సార్ సీపీ నేతల ఎన్నికల ప్రచారం



రాజాం: రామానుజలపేటలో ప్రచారం చేస్తున్న పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ నర్సింహులు తదితరులు



రాజాం సిటీ: పొనుగుటివలసలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ సతీమణి మాధవీలత



సంతకవిటి: మల్లయ్యపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

ఘనంగా మేడే

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికుల ఐక్యత వర్థిల్లాలని కార్మికులంతా నినాదాలు చేశారు. కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు.

రాజాం సిటీ: మేడే సందర్భంగా మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్మికుల హక్కులు, వాటి సాధనపై నినాదాలు చేశారు. పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు అన్నారు.

రామభద్రపురం: మేడే పురస్కరించుకుని, మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులంతా బుధవారం ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, అరుణ, రాధ, ఆశ కార్యకర్తలు కుమారి, పార్వతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

సంతకవిటి: మండలంలోని మందరాడ, కాకరాపల్లి, తమరాం గ్రామ సచివాలయాల పరిధిలోని 35 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో జి.పైడితల్లి బుధవారం తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే వారంతా రాజీనామా చేసినట్లు రాజీనామా పత్రాల్లో పేర్కొన్నారని వెల్లడించారు.

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లంతా బుధవారం రాజీనామా చేశారు.

పథకాలు కొనసాగాలంటే జగనన్నను గెలిపించండి



సంతకవిటి: వాల్తేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మల్లయ్యపేట, మంతిన, బూరాడపేట, అప్పలఅగ్రహారం, శేషాద్రిపురం, పనసపేట, జానకీపురం, వాల్తేరు, కావలి, జి.ఎస్.పురం గ్రామాల్లో బుధవారం పర్యటించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు డప్పు వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు, మంగళహారతులు, గజమాలలతో సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆయన తన ఐదేళ్ల పాలనా కాలంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిచ్చారన్నారు. కొత్త పరిశ్రమలకు పెట్టుబడులు తీసుకురావడం దగ్గర నుంచి సీ పోర్టులు, ఎయిర్ పోర్టుల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. అలాగే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామసచివాలయాల ద్వారా సాకారం చేశారన్నారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, తమను గెలిపించడంతో పాటు వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గురుగుబెల్లి స్వామి నాయుడు, వైస్ ఎంపీపీ జి.పావని, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు ఎన్.ఈశ్వరరావు, డి.నర్సింహమూర్తి, జి.చిన్నమ్మడు, టి.రవీంద్ర, పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.